అప్పు కొండంత.. అభివృద్ధి గోరంత!

- రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన 341 రోజుల్లో చేసిన అప్పు 77,118 కోట్లు
- ఒక్క ఆర్బీఐ నుంచే 52,118 కోట్ల రుణం
- గణాంకాలు వెల్లడించిన రిజర్వుబ్యాంకు

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పు కొండలా పెరిగిపోతుంటే, అభివృద్ధి మాత్రం ఆవగింజంత అయినా కనిపించడం లేదు. గత ఏడాది డిసెంబర్ 7న అధికారం చేపట్టిన నాటి నుంచి మంగళవారం వరకు అంటే 341 రోజుల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.77,118 కోట్ల అప్పులు చేసింది. తెలంగాణ జనాభా సుమారు నాలుగు కోట్ల కాగా, ఒక్కో బిడ్డ తలపై రూ.19,279 అప్పుల భారాన్ని కాంగ్రెస్ సర్కారు పెట్టింది. రేవంత్ సర్కారు సగటున రోజుకు రూ.226 కోట్లు, వారానికి రూ.1,562 కోట్లు, నెలకు రూ.6,780 కోట్ల రుణాలు సేకరిస్తున్నది. ఏడాది పాలన కూడా పూర్తికాకుండానే రికార్డుస్థాయిలో రుణాలు సమీకరించింది. 58 ఏండ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు రూ.72,658 కోట్ల అప్పు చేయగా, ఏడాది పాలన పూర్తికాకుండానే రేవంత్ సర్కారు రూ.77,118 కోట్ల అప్పు తెచ్చింది. రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.72,658 కోట్ల అప్పు తెలంగాణకు గత ప్రభుత్వాల నుంచి సంక్రమించిందని కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రంలో ప్రకటించింది. కానీ, నెలల్లోనే అంతకుమించిన అప్పు చేయడం గమనార్హం.

తాజా అప్పు 1000 కోట్లు

గతేడాది డిసెంబర్ 12న రూ.500 కోట్లతో అప్పుల పాలన మొదలు పెట్టిన రేవంత్ సర్కార్ తాజాగా మంగళవారం (నవంబర్ 12న) మరో రూ.1,000 కోట్లు అప్పు తెచ్చింది. ఒక్క ఆర్బీఐ నుంచే ఆగస్టు 13 వరకు రూ.42,118 కోట్ల అప్పులు చేసిన తెలంగాణ సర్కారు.. సెప్టెంబర్‌లో మూడు దఫాలుగా రూ.4,500 కోట్లు, అక్టోబర్‌లో మూడు దఫాలుగా రూ.4,500 కోట్లు సమీకరించుకున్నది. మంగళవారం రూ.1,000 రుణంతో మొత్తం ఆర్బీఐ నుంచి తీసుకున్న రుణం అక్షరాల రూ.52,118 కోట్లకు చేరింది. ప్రతి నెలా రూ.4,500 నుంచి రూ.ఐదు వేల కోట్ల విలువైన బాండ్ల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీఐ నుంచి అప్పులు తీసుకుంటున్నది. ఈ విషయం ఆర్బీఐ ప్రతివారం వెల్లడించే గణాంకాల ద్వారా స్పష్టమైంది. నేరుగా ఆర్బీఐ నుంచి సేకరించే రుణాలు చాలక వివిధ కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీలు ఇస్తున్నది. అధికారంలోకి వచ్చిన ఎనిమిదిన్నర నెలల్లోనే రూ.25 వేల కోట్ల మేర గ్యారెంటీలు ఇచ్చింది.

ఆర్థిక నిపుణులు ఆందోళన

ఈ ఏడాది రూ.62,012 కోట్లు రుణ సమీకరణ చేయనున్నట్టు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించింది. బహిరంగ మార్కెట్‌లో రూ.57,112 కోట్లు, కేంద్రం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1000 కోట్లు సమీకరించనున్నట్టు బడ్జెట్‌లో తెలిపింది.

ఇదీ అప్పుల భారం

ఒక్కో తెలంగాణ బిడ్డ తలపై రూ.**19,279** అప్పు

ఒక్కరోజుకు రేవంత్ సర్కారు చేస్తున్న అప్పు రూ.**226** కోట్లు

సుమారుగా ఒక్క వారానికి రూ.**1,562** రుణం

సుమారుగా నెలకు రూ.**6,780** కోట్లు

తెలంగాణ ప్రభుత్వం ఆర్బీఐ వద్ద వేలానికి పెట్టిన బాండ్లు

అప్పు (రూ.కోట్లలో)	సమయం ఏండ్లలో	తీసుకున్న తేదీ	అప్పు (రూ.కోట్లలో)	సమయం ఏండ్లలో	తీసుకున్న తేదీ
500	12	డిసెంబర్-12-2023	1,000	13	జూలై-02-2024
900	18	డిసెంబర్-19-2023	1,000	18	జూలై-02-2024
1,000	19	జనవరి-16-2024	1,000	12	జూలై-16-2024
1,000	23	జనవరి-16-2024	1,000	16	జూలై-16-2024
1,000	22	జనవరి-23-2024	1,000	13	జూలై-23-2024
1,000	11	ఫిబ్రవరి-06-2024	1,000	16	జూలై-23-2024
1,000	21	ఫిబ్రవరి-06-2024	1,000	18	జూలై-23-2024
1,000	22	ఫిబ్రవరి-13-2024	1,000	26	జూలై-30-2024
1,000	19	మార్చి-05-2024	1,000	16	ఆగస్టు-06-2024
1,000	25	మార్చి-05-2024	1,000	18	ఆగస్టు-06-2024
1,000	17	మార్చి-12-2024	1,000	22	ఆగస్టు-06-2024
1,000	26	మార్చి-12-2024	1,000	11	ఆగస్టు-13-2024
1,000	6	మార్చి-19-2024	1,000	14	ఆగస్టు-13-2024
1,000	17	మార్చి-19-2024	1,000	21	ఆగస్టు-13-2024
1,718	26	మార్చి-26-2024	1500	14	సెప్టెంబర్-03-2024
1,000	12	ఏప్రిల్-02-2024	1000	22	సెప్టెంబర్-03-2024
1,000	27	ఏప్రిల్-08-2024	1500	14	సెప్టెంబర్-10-2024
500	29	ఏప్రిల్-08-2024	500	12	సెప్టెంబర్-17-2024
1,500	18	ఏప్రిల్-23-2024	1500	15	అక్టోబర్-01-2024
1,000	12	మే-07-2024	500	18	అక్టోబర్-01-2024
1,000	17	మే-07-2024	1000	21	అక్టోబర్-15-2024
1,000	24	మే-07-2024	1000	23	అక్టోబర్-29-2024
1,000	17	మే-14-2024	500	25	అక్టోబర్-29-2024
1,000	16	జూన్-04-2024	1000	15	నవంబర్-12-2024
1,000	19	జూన్-04-2024			
1,000	12	జూన్-18-2024			
1,000	14	జూన్-18,2024			
1,000	18	జూన్-25-2024			

(భారత రిజర్వు బ్యాంకు రిపోర్టు ఆధారంగా..)

కేటీఆర్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం

నేతన్నల సంక్షేమంపై మంత్రి పొన్నం

కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 12: సిరిసిల్లలో నేత కార్మికుల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టంచేశారు. మంగళవారం ఆయన కరీంనగర్ కలెక్టరేట్‌లో మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గతంలో కేటీఆర్ ఎమ్మెల్యేగా, తాను ఎంపీగా ఉన్నప్పుడు చేనేత కార్మికుల సమస్యల కోసం కలిసి పనిచేశామని గుర్తుచేసుకున్నారు. తనను రమ్మని కోరితే కేటీఆర్ వద్దకు వెళ్తానని చెప్పారు. నేత కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఎవరు సూచనలు, సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామని తెలిపారు. ఇటీవల సిరిసిల్లలో జరిగిన కుటుంబం ఆత్మహత్యకు గతంలో చేసిన అప్పులే కారణమని నివేదికలందాయని పేర్కొన్నారు. రైస్ మిల్లర్ల నుంచి సీఎంఆర్‌కు సంబంధించి ఇంకా రూ.18 వేల కోట్ల విలువైన ధాన్యం రావాల్సి ఉన్నదని, అయినా ప్రభుత్వం తమను బద్నాం చేస్తున్నదంటూ మిల్లర్లు వ్యాఖ్యలు చేయడం సబబు కాదని చెప్పారు. సమగ్ర ఇంటింటి సర్వేపై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కుటుంబ యజమానికి నష్టం జరుగుతుందని భావిస్తే, సదరు సమాచారాన్ని ఇవ్వకపోయినా పరువాలేదని తెలిపారు. ఇది ప్రభుత్వ పరంగా జరుగుతున్న సర్వే అని, ప్రతి విషయం గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లను, సర్వేను పరిశీలిస్తున్న అధికారులను బెదిరింపులకు గురిచేసినా, వారిపై దాడులకు పాల్పడినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మండల సమాఖ్యల ఆధ్వర్యంలో రోడ్డు రవాణా సంస్థలో ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మొదటి విడతగా 600 బస్సులు ఐకేపీ ద్వారా కొనుగోలు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడి అత్యంత హేయనీయమని, విచారణకు రమ్మని నమ్మపలికి గ్రామస్థులతో కలిసి దాడి చేయడం న్యాయమేనా? దాడులతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందా? అని ప్రశ్నించారు.

18న టీజీఎస్‌వోఏ ఎన్నికలు

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఎస్‌వోఏ) ఎన్నికలకు మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 18న ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి ఎన్ శంకర్ తెలిపారు. నేటి (బుధవారం) నుంచి నామినేషన్లు తీసుకోనున్నట్టు వెల్లడించారు.

గొర్రెలు, మేకల పెంపకానికి రుణాలు

- పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఘోష్

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): గొర్రెలు, మేకల పెంపకందారులకు రుణాలు ఇవ్వనున్నామని పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఘోష్ తెలిపారు. హైదరాబాద్ లోని పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యాలయం నుంచి జూమ్ మీటింగ్ ద్వారా రాష్ట్రంలోని జిల్లా పశు వైద్యాధికారులతో ఎన్ఎల్ఎం పథకం రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. బ్యాంకులు 67 (గొర్రెలు, మేకలు), 3 పౌల్ట్రీ ప్రాజెక్టులకు రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చాయి. సమావేశంలో తెలంగాణ పశుసంవర్ధక శాఖ సంచాలకుడు గోపి, సీఈవో మల్లీశ్వరి, గొర్రెల, మేకల పెంపకదారుల సమాఖ్య ఎండీ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

శ్రీరామ్స్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): సివిల్స్ ఆశావహులకు ఢిల్లీ తరహా కోచింగ్ ఇవ్వటమే లక్ష్యంగా హైదరాబాద్‌లో శ్రీరామ్స్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ బ్రాంచీని ప్రారంభించింది. ఢిల్లీ, పూణేల్లో సేవలందించిన సంస్థ.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో మరో శాఖను ప్రారంభించినట్టు అసోసియేట్ శ్రీరంగం శ్రీశ్రీ తెలిపారు. తమ కోచింగ్ సెంటర్‌లో యూపీఎస్సీ ఫౌండేషన్ కోర్సు, మెంటార్‌షిప్, టెస్ట్ సిరీస్, టీజీపీఎస్సీ పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

మా వెనుక సీఎం తమ్ముడున్నాడు!

- యాడ్ ఏజెన్సీకి బెదిరింపులు
- 4 నెలలుగా యాడ్ బోర్డుల తొలగింపు
- మిథున అడ్వర్టైజింగ్ కంపెనీకి వేధింపులు
- ఆదుకోవాలంటూ యజమాని వీడియో రిలీజ్

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): సీఎం తమ్ముడి పేరిట రెండు ప్రముఖ యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని మిథున యాడ్ ఏజెన్సీ యజమాని కే శోభ తెలిపారు. హైదరాబాద్ వ్యాప్తంగా తమ అడ్వర్టైజింగ్ కంపెనీ యాడ్ బోర్డులను తొలగిస్తూ.. వారి కంపెనీల బోర్డులను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. 'మా వెనుక సీఎం తమ్ముడు ఉన్నాడు.. ఇలాగే చేస్తాం.. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని నాలుగు నెలలుగా వేధిస్తున్నారని ఆమె వీడియో రిలీజ్ చేశారు. చెప్పినట్టు వినకుంటే యాడ్ ఆఫర్లు రాకుండా చేస్తామని కాల్స్ చేస్తూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

అక్రమంగా హోర్డింగ్స్ ఏర్పాటు

2024 మార్చి 18 నుంచి కొత్త బోర్డులకు అనుమతి ఇవ్వొద్దని జీహెచ్ఎంసీ సర్క్యులర్ విడుదల చేసినా.. వాటిని లెక్క చేయకుండా ఆ రెండు కంపెనీలు యునిపోల్స్, హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తున్నాయని ఆరోపించారు. ఆ కంపెనీలకు జీహెచ్ఎంసీలోని కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నారని ఆరోపించారు.

నాలుగు వేలు ఎప్పుడొస్తయి?

- పాలకుర్తి ఎమ్మెల్యేను ప్రశ్నించిన వృద్ధురాలు
- నాలుగు రోజుల్లోనే వస్తయన్న యశస్వినీరెడ్డి
- రాకపోతే గుర్తుచేయాలని శ్రేణులకు సూచన
- సోషల్ మీడియాలో వైరల్ అయిన పాత వీడియో
- 49 రోజులైనా పెన్షన్ అందలేదంటూ నెటిజన్ల సెటైర్లు

సోమలక్ష్మితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి (ఫైల్)

రాయపర్తి, నవంబర్ 12: 'నాలుగు రోజుల్లో రూ. 4 వేల పింఛన్ వస్తది. రాకపోతే నాకు గుర్తుచేయాలి' అంటూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఓ వృద్ధురాలితో చెప్పిన పాత వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎమ్మెల్యే చెప్పిన నాలుగు రోజులు పోయి.. ప్రస్తుతం 49 రోజులు గడుస్తున్నది. అయినా.. ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న వృద్ధురాలికి పెరిగిన పెన్షన్ అందడం లేదంటూ సెటైర్లు పేలుతున్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామం (పాలకుర్తి నియోజకవర్గం)లో నిర్వహిస్తున్న కేజీబీవీ పాఠశాలను సెప్టెంబర్ 24న అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఆమె తిరుగు ప్రయాణమవుతున్న సందర్భంగా పాఠశాల సమీపంలో నివాసముండే వృద్ధురాలు సోమలక్ష్మి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి వాహనానికి అడ్డుగా వచ్చి మాట్లాడేందుకు యత్నించింది. ఆమెను ఎమ్మెల్యే భద్రతా సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేయగా.. ఎమ్మెల్యే కారులో నుంచి బయటకు వచ్చి వృద్ధురాలిని ఏం కావాలని అడిగింది. తనకు కేసీఆర్ ఇస్తున్న రూ.2 వేల పింఛన్ సరిపోవడం లేదని, ఇబ్బందులు పడుతున్నానని తెలిపింది. వెంటనే ఎమ్మెల్యే నాలుగు రోజుల్లోనే రూ.4 వేల పెన్షన్ వస్తుందని వృద్ధురాలికి చెప్పడంతోపాటు.. రాకపోతే తనకు గుర్తుచేయాలని అక్కడే ఉన్న గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జినుగు రత్నాకర్‌రెడ్డి, గజవెల్లి రామశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డికి సూచించారు. ఇప్పటికి 49 రోజులైనా ఫలితం లేకపోవడంతో ఈ వీడియోను పలువురు సోషల్ మీడియాలో వైరల్ చేస్తుండటంతో ప్రజలు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

కొత్తగా నాలుగు డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లు

- ప్రస్తుత అవసరాలకు సరిపడేలా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ
- డ్రగ్స్‌పై ఫిర్యాదులకు కలెక్టరేట్లలో కంప్లైంట్స్ సెల్స్ : మంత్రి దామోదర

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కొత్తగా 4 డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ల్యాబ్‌ను ఆధునీకరించడానికి కావల్సిన వసతులను కల్పిస్తామని చెప్పారు. డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు, తెలంగాణ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో మంగళవారం వెంగళరావు నగర్‌లోని డీసీఏ ఆఫీస్‌లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మష్కలర్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మెడిసిన్‌కు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, ఆకస్మిక తనిఖీల కోసం స్టేట్ విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లలో డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదుల కోసం కంప్లైంట్ సెల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా 4 కొత్త ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం 71 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు ఇంకో 80 మంది సిబ్బందిని పెంచుతామని చెప్పారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను వారు పనిచేస్తున్న ప్రాంతానికే పరిమితం చేయకుండా.. ఇతర ప్రాంతాల్లో తనిఖీకు పంపించాలని డీజీ కమలాసన్‌రెడ్డికి సూచించారు. దవాఖానలకు వచ్చే మందులు నాణ్యంగా ఉండేలా డీసీఏ, టీజీఎంఎస్ఐడీసీ చర్యలు తీసుకోవాలన్నారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సహదేవరావు, డీసీఏ జేడీ రాందాన్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ వద్ద బీఆర్ఎస్‌వీ ధర్నా

- స్వాతిప్రియ ఆత్మహత్యను నిరసిస్తూ కార్యకర్తల ఆందోళన
- సీఎం ట్రిపుల్ ఐటీని పట్టించుకోవడం లేదని మండిపాటు

బాసర, నవంబర్ 12: స్వాతిప్రియ ఆత్మహత్యను నిరసిస్తూ బీఆర్ఎస్‌వీ విద్యార్థి సంఘం కార్యకర్తలు మంగళవారం సాయంత్రం ట్రిపుల్ ఐటీ వద్ద ధర్నా నిర్వహించారు. ఘటనకు గల కారణాలను తెలుసుకునేందుకు శాంతియుతంగా వచ్చిన సంఘం కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటామని, తమకు లోపలికి అనుమతివ్వాలని కోరారు. అయినా అనుమతి ఇవ్వలేదు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ నాయకులు మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి గోడదూకి విద్యార్థుల సమస్యలను తీర్చాలన్నారని గుర్తుచేస్తూ.. ముఖ్యమంత్రి అయి 11 నెలలు గడుస్తున్నా.. ఇటీవల కాలంలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నా ట్రిపుల్ ఐటీపై పట్టింపు లేదని మండిపడ్డారు. లోపలికి అనుమతించక పోవడంతో గేటులోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అరెస్టు చేశారు.

విధుల నుంచి సీఎస్‌వో తొలగింపు

స్వాతిప్రియ ఆత్మహత్య ఘటనలో ఏబీవీపీ కార్యకర్తలు, ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బందికి మధ్య జరిగిన ఘర్షణలో ఏబీవీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సీఎస్‌వో (చీఫ్ సెక్రటరీ ఆఫీసర్)గా పనిచేస్తున్న రాకేశ్‌ను విధుల నుంచి తొలగించారు. పోలీసు శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు విధుల నుంచి రిలీవ్ చేశారు.

ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

బాసర ట్రిపుల్ ఐటీని సీఎం సందర్శించాలి : ఏఐఎస్ఎఫ్

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): పేద, మధ్య తరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య అందించే బాసర ట్రిపుల్ ఐటీలో పిల్లలు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ర్యాగింగ్ ఆరోపణల నేపథ్యంలో అధికారులు క్యాంపస్‌ను సందర్శించాలన్నారు. విద్యార్థిని స్వాతి ప్రియ ఆత్మహత్యపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు తెలిపినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ట్రిపుల్ ఐటీకి వస్తానన్న రేవంత్‌రెడ్డి హామీని గుర్తుచేశారు. 11నెలలు కావస్తున్నా విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించలేదని విమర్శించారు. వెంటనే సీఎం బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించాలని డిమాండ్ చేశారు.

అధికారుల్లో అభద్రతాభావం!

వరుస బదిలీలతో ఐఏఎస్‌లలో కలవరం

- గుట్టలుగా మంత్రులు, నేతల సిఫారసులు
- కిందిస్థాయి అధికారులకు బెదిరింపులు
- ఫైళ్లపై సంతకాలు పెట్టాలంటేనే భయం

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ చర్యలతో అధికారులు అభద్రతా భావంలో మునిగిపోయారు. ఏ ఫైల్ పై సంతకం పెట్టాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. ప్రభుత్వం విచ్చలవిడిగా బదిలీలు చేస్తుండటంతో ముఖ్యంగా ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు కలవరపడుతున్నారు. ఎప్పుడు ఏ పోస్ట్‌లో ఉంటామో, ఎప్పుడు బదిలీ అవుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. వరుస బదిలీల కారణంగా నిర్ణయాలు స్థిరంగా తీసుకోలేకపోతున్నారు. ఒకవేళ ఏదైనా నిర్ణయం తీసుకున్నా వాటిని అమలు చేసే వరకు ఉంటామో లేదోననే అనుమానం వారిని వెంటాడుతున్నది. మరోవైపు మంత్రులతోపాటు కీలక నేతలుగా చెప్పుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో పైరవీలు ఎక్కువైపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మంత్రి నుంచి లెక్కకు మించి సిఫారసు లేఖలు వస్తున్నాయని చెప్తున్నారు. దీంతోపాటు తమ పనులు చేయాలంటూ కాంగ్రెస్ నేతల ఒత్తిడి పెరిగిపోతున్నదని కిందిస్థాయి అధికారులు వాపోతున్నారు.

కుదురుకునేలోగా బదిలీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత 11 నెలల్లో అనేకసార్లు ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులను బదిలీ చేసింది. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు 11 నెలల్లోనే మూడు నాలుగు స్థానాలు మారాల్సి వచ్చింది. వారు కొత్తచోట కుదురుకునే లోగానే మళ్లీ బదిలీ చేస్తుండటంతో తలలు పట్టుకుంటున్నారు. ఆ శాఖపై లేదా ఆ జిల్లాపై అవగాహన పెంచుకునేలోగా కొత్త ప్రాంతానికి వెళ్లాల్సి వస్తున్నదని, ఇది మానసికంగా ఎంతో ఒత్తిడికి గురి చేస్తున్నదని ఐఏఎస్ అధికారులు వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లాకు 11 నెలల్లో ముగ్గురు కలెక్టర్లు మారారు. అంటే మూడున్నర నెలలకు ఒకరిని చొప్పున మార్చినట్టు చెప్తున్నారు. టీకే శ్రీదేవిని కూడా వాణిజ్య పన్నుల శాఖ నుంచి ఆగస్టులో ఎస్సీ డెవలప్‌మెంట్‌కు, తాజాగా అక్కడి నుంచి మున్సిపల్ విభాగానికి బదిలీ చేశారని గుర్తు చేస్తున్నారు. మున్సిపల్ శాఖలో కీలకమైన సీడీఎంఏ పోస్టుకు ఇప్పటివరకు ఐదుగురు అధికారులు మారారు. ఐపీఎస్ అధికారులది కూడా ఇదే పరిస్థితి. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను అంతకుముందు నాలుగుసార్లు బదిలీ చేశారు. ఎస్ఏఎం రిజ్వీ మూడుసార్లు బదిలీ అయ్యారు. ఇలాంటి అనేక ఉదాహరణలు ఉన్నాయని చెప్తున్నారు. కాబట్టి ఏ పదవిలో ఎప్పుడు, ఎక్కడ ఉంటామో తెలియదు కాబట్టి అనవసర తలనొప్పులు ఎందుకు అంటూ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

మౌఖిక ఆదేశాలతో హడల్

కొందరు మంత్రులు, కీలక నేతలు మౌఖికంగా ఆదేశాలు ఇచ్చి పనులు చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని పలువురు ఐఏఎస్‌లు వాపోతున్నారు. వచ్చే ఏడాది ప్రభుత్వం మారుతుందని, ముఖ్యమంత్రి మారుతారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మౌఖికాదేశాలతో చేసే పనులతో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని భయపడుతున్నారు. ఒకవేళ వాటితో ఏదైనా సమస్య ఏర్పడితే తమ మెడకు చుట్టుకుంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనవసరంగా తమ కెరీర్‌కు మచ్చ ఎందుకు తెచ్చుకోవాలని ఆలోచిస్తున్నారు.

కిందిస్థాయి నాయకుల ఒత్తిడి

కిందిస్థాయి అధికారులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడి ఎక్కువగా ఉన్నదని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. బిల్లులు, పనులు, కాంట్రాక్టులు.. ఇలా అనేక అంశాల్లో మంత్రులు, ఎంఎల్ఏలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ముఖ్య నేతలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని చెప్తున్నారు. చిన్న నేతలు కూడా మంత్రులు, బడానేతల పేర్లు చెప్తున్నారని, వారు చెప్పిన మాట వినకుంటే బదిలీ చేయిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు చెప్పుకుందామన్నా, వారి పరిస్థితి కూడా ఇలాగే ఉన్నదని వాపోతున్నారు. ఇలా అధికారుల్లో కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ భయపడే పరిస్థితులు దాపురించాయి.

జేఎల్ నియామక పత్రాలేవి?



జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు ఎంపికైన తమకు నియామకపత్రాలు ఎప్పుడిస్తారంటూ అభ్యర్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 60రోజుల్లో డీఎస్సీ ఫలితాలిచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న సర్కారు.. 600 రోజులు గడిచినా జేఎల్ నియామకపత్రాలు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జేఎల్ అభ్యర్థులు మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పించారు. 2022లో జేఎల్ నోటిఫికేషన్ ఇచ్చారని, 2023లో పరీక్షలు రాయగా, 2024లో ఫలితాలిచ్చారని పేర్కొన్నారు. అతి తక్కువ రోజుల్లో డీఎస్సీ-24 ఫలితాలు విడుదల చేసి, నియామక పత్రాలిచ్చి, జేఎల్ విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం దగ్గరే విద్యాశాఖ ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. – హైదరాబాద్

మా గ్రామాన్ని బల్దియాలో కలుపొద్దు

తమ గ్రామాన్ని మద్దూరు మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని రెనివట్ల వాసులు మంగళవారం నారాయణపేట జిల్లా మద్దూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. బల్దియాలో తమ గ్రామాన్ని కలిపితే ఉపాధి హామీ పనులు కోల్పోయే ప్రమాదం ఉందని వాపోయారు. అందుకే తమ గ్రామాన్ని స్వతంత్ర గ్రామ పంచాయతీగానే ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా రెనివట్ల రోడ్డు వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. – మద్దూర్ (కొత్తపల్లి)

పురుగుల అన్నం, నీళ్ల చారు ఎలా తినాలి?



'ఉడికీ ఉడకని పురుగుల అన్నం, నీళ్ల చారుతో ఎలా తినాలి' అంటూ మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. హాస్టల్‌లోని 120 మంది విద్యార్థులు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. వంట నిర్వాహకుల మధ్య సమన్వయలోపంతో అన్నం సరిగ్గా వండటం లేదని, అన్నంలో పురుగులు, రాళ్లు వస్తున్నాయని, నీళ్ల పప్పు చారు పోస్తున్నారని వాపోయారు. విషయం తెలుసుకున్న బీసీ వెల్ఫేర్ డివిజన్ అధికారి ఖాజా నజీమ్ అలీ, పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. –వెల్దండ